క్లుప్తంగా

హనుమత్ జయంత్యుత్సవాలు



తెనాలిటౌన్: మారీసు పేటలోని చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, పది లక్షల ప్రదక్షిణాల మహా యజ్ఞం బుధవారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగగా ఉదయం 6.30 గంటలకు వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం జరిపారు. నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ గావించారు. అనంతరం లలితా గోష్టి.. హనుమాన్ చాలీసా చేశారు. ప్రత్యేక పూజలు జరిపారు.

పాత గుంటూరు: పాత గుంటూరులోని విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. వీరాంజనేయ స్వామికి 108 కలశాలతో మహాస్నపన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు కొప్పు రావూరి బాబురావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణ రావు, చీమకుర్తి తాండవ నాగ మల్లేశ్వరరావు, కాసుల వెంకట శివ ప్రసాద్, నాగం రామారావు పాల్గొన్నారు.

అనూషకు డాక్టరేట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మాసూటికల్ సైన్సెస్ పరిశోధకురాలు నూతక్కి అనూషకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఫార్మసీ పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ పి.రవి పర్యవేక్షణలో 'ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ బయలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ డిఫరెంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఆఫ్ అండ్రోగ్రాఫిస్ ఎకియాడ్స్, కొమ్మికార్పస్ చైనెసిస్ అండ్ టాలినమ్ పోర్‌ట్యులేసిఫోలియం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని వివరించారు.

కుట్టు మిషన్లు పంపిణీ



గుంటూరు మెడికల్: సుష్మగౌడ్ 24వ జయంతి సందర్భంగా స్థానిక పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బుధవారం ముగ్గురు పేద వితంతువులకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సహాయంతో ఆర్థికంగా అభివృద్ధిచెందాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జల్లెడ ఓంకారం, ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మ రావు గౌడ్, ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివప్రసాద్ గౌడ్, కోశాధికారి జల్లెడ జయ సుస్మితా రావు గౌడ్, సహా కార్యదర్శి హరిత గౌడ్, చిలకా తన్మయ పట్నాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు, పేదలకు అన్నదానం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా ఆశ్రమం, నాజరు పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీ నగర్‌లోని షిరిడి సాయి ఆశ్రమంలో వృద్ధులకు, రైల్వేస్టేషన్ రోడ్డులోని నిరుపేదలకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. దాన సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు ఉమారాణి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్వీయోగ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, సభ్యులు అనూష, తేజ, ఆశ్రమాల నిర్వాహకులు రామలింగాచారి, మురళి, భారతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం

గుంటూరు రూరల్: ఇంట్లో పనులు సక్రమంగా చేయటం లేదని తల్లి మందలించటంతో కుమార్తె ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం నగరాలులోని హిమని నగర్‌లో విన్నకోట సుదర్శనరావు, ఆయన భార్య కళ్యాణి, కూతరు నిహారిక లక్ష్మి నివసిస్తుంటారు. రెండు రోజులుగా ఇంట్లో పనులు సక్రమంగా చేయటంలేదని తల్లి కుమార్తెను బుధవారం ఉదయం మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కుమార్తె ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ

- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- సచివాలయ ఉద్యోగులకు రెగ్యులరైజ్డ్ ఉత్తర్వులను అందజేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వార్డు అడ్మిన్ కూచిపూడి రోహిణికి ఉత్తర్వులు అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: దేశానికే ఆదర్శమైన సచివాలయ వ్యవస్థలో భాగస్వాములైన ఉద్యోగులు.. ప్రజలకు అందించే సేవలతో ప్రభుత్వానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసినపుడు పరిపాలన సజావుగా నడుస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు లభిస్తాయని ఆయన చెప్పారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. సభలో ప్రొబేషనరీ సర్వీసు పూర్తయిన 30 మంది సచివాలయ ఉద్యోగులకు రెగ్యులరైజ్ ఉత్తర్వులను ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. వీరిలో ఇద్దరు వార్డు అడ్మిన్లు, ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు నలుగురు, ప్లానింగ్ సెక్షన్‌లో 18 మంది ఉన్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వలంటీరు, సచివాలయ వ్యవస్థలు లబ్ధిదారులను గుర్తించటం, ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో సంక్షేమ లబ్ధిని జమచేయటం అనేది కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మినహా దేశంలో మరెక్కడా లేదని గుర్తుచేశారు. సమస్యలు, అవసరాల కోసం వచ్చిన ప్రజలకు సమర్థంగా సేవలందించటం ద్వారా ప్రభుత్వం ఆశించిన ఉద్దేశం నెరవేరుతుందని పేర్కొన్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నూరు శాతం సంతృప్తికర సేవలు అందించినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సహనం, ఓర్పు అవసరమన్నారు. ఇష్టంతో కష్టపడి పనిచేసినప్పుడే ప్రజలకు సక్రమంగా సేవలను అందించవచ్చని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ రెగ్యులరైజ్ అయిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. మేనేజరు అప్పలరాజు స్వాగతం పలికారు. అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, షేక్ దుబాయ్‌బాబు, ఇస్మాయిల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, పినపాటి అనిల్ పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు నిదర్శనమే 'జగనన్నకు చెబుదాం'

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలనపై ప్రజలు, ప్రజా ప్రతినిధులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో బుధవారం రెండో రోజు నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్ ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేస్తూ ముందుకు వెళ్లారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకుల కన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన సంక్షేమ పాలన అందిస్తున్నారని చెప్పారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ లబ్ధిని అందజేస్తున్నారని తెలిపారు. 1092 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని తెలిపారు. తెనాలి నియోజకవర్గంలో 1,04,462 ఇళ్లు ఉండగా వాటిలో 85.20 శాతం ఇళ్లకు సంక్షేమ లబ్ధి అందుతోందని వివరించారు. ఒక పెదరావూరు గ్రామంలోనే 700 మందికి నివేశన స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలు రాలేదని కొందరు తమ దృష్టికి తీసుకువచ్చారని, వారి అర్హతను పరిశీలించి అర్హులందరికీ స్థలాలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో కుదరవల్లి శంకరరావురావు, కాకి మనోజ్, రావూరి విజయ్, బాలరాజు, రావూరి శ్రీను, వేమూరి శ్రీను, ఇతర గ్రామ పార్టీ నాయకులు, పురపాలక సంఘ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- హారం, వెండి వస్తువులు, నగదు అపహరణ



దుండగులు పగలకొట్టిన తలుపు



తెరిచి ఉన్న బీరువా

తెనాలిరూరల్: తెనాలిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటిలో పెద్ద మొత్తంలో బంగారం కనబడకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. అయితే ఒక హారం, వెండి వస్తువులు, కొంత నగదు అపహరణకు గురయ్యాయి. ఎక్కువ ఆభరణాలు ఉన్న సంచి ఇంట్లోనే కనబడడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. వివరాల మేరకు.. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీరావుపేటలోని మహేంద్రకాలనీకి చెందిన కొలసాని విశ్రాంత ఉపాధ్యాయుడు కొలసాని భూపతి నాయుడు.. హైదరాబాదులోని తన కుమారుడి గృహ ప్రవేశానికి ఈ నెల 2న ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం వీరి ఇంటికి వచ్చిన పని మనిషి తలుపు పగుల కొట్టి ఉండటాన్ని గుర్తించి ఫోన్ ద్వారా వారికి సమాచారం ఇచ్చింది. చోరీ జరిగినట్లు తెలుసుకున్న భూపతి నాయుడు.. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. హైదరాబాద్ నుంచి బుధవారం తెనాలి చేరుకున్నారు. ఇంట్లో చూడగా.. బీరువాలు తెరిచి ఉంచడం, సామాను మొత్తం చెల్లా చెదురుగా పడిఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 75 గ్రాముల హారం, 10 గ్రాముల చెవి దిద్దులు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటితో పాటు కొన్ని వెండి వస్తువులు, రూ. 32 వేల నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. అలానే ఇంటి కింద పోర్షన్ లో ఉంటున్న భూపతి నాయుడు తల్లి ఇంట్లో కూడా కొన్ని వెండి వస్తువులు, రూ. 10 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. అయితే తొలుత 350 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగిందని భావించారు. ఆభరణాలున్న సంచిని దుండగులు చీరలు, ఇతర వస్త్రాలతో పాటు కింద పడేశారు. అందులోని ఆభరణాలను గుర్తించలేకపోయారు. మొత్తంగా రూ.2లక్షలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, నగదు చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు, ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్, సిబ్బందితో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కళాకారిణి శారదా చలపతికి సన్మానం



శారదా చలపతిని సన్మానిస్తున్న రజని, శివనాగలక్ష్మి

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం మేజర్ చంద్రకాంత్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సంపూర్ణ రామాయణం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం గాయని, కళాకారిణి, సంకీర్తనాపరురాలు ఉప్పలూరి శారదా చలపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమ్మెల రజని, చక్రాల శివనాగలక్ష్మి, మహాలక్ష్మి, పంచుమర్తి భాస్కరరావు, బిట్రా యుగంధర్, ఉప్పలూరి శేషాచలపతి, ముద్దాభక్తుని రమణయ్య, ఒగ్గు వెంకట కృష్ణారావు, కౌతరపు లీలాకృష్ణ, సూర్యదేవర లీలావతి, ఉమ్మలనేని ధర్మారావు, ఎన్‌సీసీ వెంకట్, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

14న హనుమాన్ శోభాయాత్ర



పోస్టరును ఆవిష్కరించిన రామకృష్ణ

తెనాలి: హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 14న తెనాలిలో జరగనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ కోరారు. స్థానిక ఉప్పు బజారులో బుధవారం సాయంత్రం శోభాయాత్ర కమిటీ సభ్యులతో కలిసి శ్రీహనుమాన్ శోభాయాత్ర వాల్ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. గతేడాది ఎంతో వైభవంగా శోభాయాత్ర జరిగిందని, ఎందరో భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసినట్లు గుర్తుశారు. అదేవిధంగా ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు సుల్తానా బాద్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అక్కడ్నుంచి బైక్ ర్యాలీతో శోభాయాత్ర పట్టణ వీధుల్నుంచి బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు కొనసాగుతుందదని వివరించారు. కమిటీ సభ్యులు అన్నవరపు వేణు, వేమా సురేష్‌బాబు, కొత్తమాసు రామకృష్ణ, కాళిదాసు వెంకటేశ్వరరావు, కొడాలి క్రాంతి, శనగపల్లి నాగేశ్వరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ క్రీడాకారుడు మధుబాబుకు సత్కారం



మధుబాబును సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: బల్గేరియాలో ఇటీవల జరిగిన మెన్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో భారత హ్యాండ్‌బాల్ జట్టు తరఫున ఆడిన పట్టణ క్రీడాకారుడు జె.మధుబాబును బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సత్కరించారు. చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియంలోని హ్యాండ్‌బాల్ అకాడమీలో సాధన చేస్తున్న మధుబాబు, భారత హ్యాండ్‌బాల్ జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఆ పోటీల్లో భారత జట్టు సెమీ ఫైనల్స్ చేరుకుని, తృతీయ బహుమతిని దక్కించుకుంది. గోల్ కీపర్‌గా స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించిన మధుబాబును అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను అందుకోవాలని కాంక్షించారు. వీరితో అకాడమీ కోచ్ కె.నాగరాజు ఉన్నారు.

కార్యదర్శులకు బాధ్యత లేదా



పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న డీపీఓ

ప్రత్తిపాడు: గృహ నిర్మాణాల విషయంలో కార్యదర్శులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి ప్రశ్నించారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డీపీఓ కేశవరెడ్డి జగనన్న గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిపై సమీక్షించారు. యనమదలలో తొమ్మిది గృహాలు శ్లాబ్ వరకు వచ్చి, శ్లాబ్ పూర్తి కాకుండా నెలల తరబడి ఉండటంపై ఆ గ్రామ కార్యదర్శి తోపాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ముందు ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోండి.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు పంచాయతీ కార్యదర్శులకు పన్నుల వసూళ్లలో నిమగ్నం కావడంతో ఒత్తిడి చెయ్యలేదని, కానీ ఇప్పుడు కార్యదర్శులు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామ సచివాలయాల్లోని ఫంక్షనల్ అసిస్టెంట్లును సంబంధిత గ్రామంలోని వలంటీర్లతో ట్యాగ్ చేసినప్పటికీ ప్రగతి కనిపించకపోవడం సరికాదన్నారు. వచ్చే సమావేశానికి ఆయా లే అవుట్లకు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్లు కూడా హాజరు కావాలని, వారి సమక్షంలోనే సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాల్సిందేనని పేర్కొన్నారు.

మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



పాత గుంటూరు: ప్రజల శ్రేయస్సు కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు వరకు జరిగే అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో గుంటూరు ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం నాజ్ సెంటర్ కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో మహా యజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే మహాయజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాసరావు, చైర్మన్ పి.జయ ప్రకాష్ రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకట రత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వర రావు, వెంకట రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక వైద్యుల సేవలు ప్రశంసనీయం

సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి



రోగిని పరామర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి

గుంటూరు మెడికల్: మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో వైద్యులు ఈ విభాగాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా బుధవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాన్ని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆ విభాగం వైద్యులతో సమీక్షించారు. మానసిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడినప్పుడు వైద్య సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక సమస్యలకు వైద్యులు వైద్య సేవలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య వృత్తిలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచన ఎక్కువైందని వివరించారు. మానసిక వైద్య విభాగాన్ని వైద్యులు ఎంపిక చేసుకోవడం చాలా అరుదుగా కనిపిస్తోందన్నారు. మహిళా వైద్యులు కూడా ఈ విభాగాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు న్యాయ పరమైన సమస్యలు ఉంటే ఆస్పత్రిలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్, మాజీ అదనపు పిపి కట్టా కాళిదాసు, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నిమిషా, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభినందన



గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుగా, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వై షేక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో 70 మందికిపైగా వైద్యులను డాక్టర్ వై షేక్ పార్టీలో చేర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో డాక్టర్ వై షేక్‌ను శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన సేవలందించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

– గుంటూరు మెడికల్

నేడు పన్ను డిమాండ్ నోటీసులో తప్పుల సవరణ

తెనాలి: పట్టణ పురపాలక సంఘం ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులకు సంబంధించిన డిమాండ్ నోటీసులో చిన్న చిన్న తప్పులను సవరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు తమ డిమాండ్ నోటీసులో డోర్ నంబరు, యజమాని పేరులో అక్షర దోషాలు, ఇంకా ఏవైనా తప్పులు ఉన్నట్టయితే సంబంధిత ఆధార పత్రాలతో 11న మున్సిపాలిటీకి వచ్చి వెంటనే సరిచేయించుకోవాలని పేర్కొన్నారు.

శ్రీ విద్యాపీఠంలో ప్రత్యేక పూజలు

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం వ్యవస్థాపకుడు బాల స్వామిజీ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన దాన సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు ఉమారాణి దంపతులు వివాహ మహోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి వారిని ఆశీర్వదించారు. ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, శ్రీ విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీ–13 సెక్షన్‌లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ వివరాలను విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు బుధవారం వెల్లడించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 4,808 సర్వీసులు తనిఖీచేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 370 మందికి రూ.19.7 లక్షలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండాలని, సీలు లేకున్నా.. తుప్పు పట్టి ఊడినా వెంటనే అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచిచారు. మీటర్లకు సీలు లేకపోతే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం చేస్తూ దొరికితే అపరాధరుసుం విధిస్తామని, రెండోసారి అదేతప్పు చేస్తే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా, వాట్సాప్ ద్వారా చేయవచ్చని వివరించారు. తనిఖీల్లో డీఈఈ ఎం.రవికుమార్, పి.హెచ్.ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, వి.బాజీ పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సాయినగర్ ప్రాంతంలో నెల రోజుల కిందట రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. చోరీకి పాల్పడ్డ యువకుడిని తాడేపల్లి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా మందూరుకు చెందిన బాదరబోయిన సాయికృష్ణ ఉండవల్లి సాయినగర్‌లో మేనత్త దగ్గర నివాసముంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సాయికృష్ణకు అప్పులు ఉండడంతో వారి దగ్గర నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో ద్విచక్రవాహనాల అపహరణకు పాల్పడ్డాడు. సాయినగర్‌లో నివసించే నరేంద్ర, శ్రీనివాసరావులు తమ ద్విచక్రవాహనాలను ఇంటి ముందు పార్కింగ్ చేసుకున్నారు. అక్కడే నివాసముంటున్న సాయి మొదట ఒక బైక్‌లు దొంగిలించి స్వగ్రామానికి తీసుకు వెళ్లాడు. రెండో బండి కూడా తీసుకు వెళుతున్నాడు. ఆ సమయలలో ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా బండి వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

రేపు తాడికొండలో జాబ్‌మేళా

తాడికొండ: తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ ఇన్‌చార్జి ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు తెలిపారు. బుధవారం బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, డీఆర్‌డీఏ, జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 బహుళ జాతి, ఇతర కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నాయని, 10వ తరగతి, బీటెక్ విద్యార్హత వరకు కలిగిన యువతీ యువకులకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్ఐ బాధ్యతల స్వీకారం

మంగళగిరి: మంగళగిరి రూరల్ ఎస్ఐగా బి.జగన్‌మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో రూరల్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన బి విజయ్‌కుమార్‌రెడ్డి ఇటీవల వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బి జగన్‌మోహనరావు రూరల్ ఎస్‌హెచ్‌ఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.